## కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

కంఠేశ్వర్, మే 17: జిల్లాలో వరి కొనుగోళ్లపై నగరంలోని కలెక్టరేట్‌లో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ శనివారం సమీక్ష నిర్వహించారు. సివిల్ సప్లయీస్ అధికారులు, సీపీ సాయిచైతన్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్, రైస్ మిల్లుల యజమానులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. కొనుగోళ్లలో జాప్యం, లారీలు, హమాలీల కొరత, రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ తదితర సమస్యలపై చర్చించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.

## గోడౌన్ల తనిఖీ

ఇందల్వాయి, మే 17: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని నల్లవెల్లి, ఇందల్వాయి సహకార సంఘాల ఎరువుల గోడౌన్లను తహసీల్దార్ వెంకట్ రావు మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వ, అమ్మకం తీరు తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతులకు రసీదు ఇవ్వాలని, ప్రతి కొనుగోలును పీవోఎస్ మిషన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయించొద్దన్నారు. ఎరువుల నిల్వ వివరాలను గోడౌన్ బయట రైతులకు అర్థమయ్యేలా ప్రదర్శించాలని సూచించారు. రైతులు అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు సరిపడా ఎరువులు నిల్వ ఉన్నాయని తెలిపారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్లు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## రేపు సీఎస్, డీవోల సమావేశం

ఖలీల్‌వాడి, మే 17: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారుల(డీఏ) సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో ఉదయం 10:30గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు.

## స్వామి రాందేవ్ మహరాజ్ సన్యాసీ దివస్

యోగాసనాలు వేయిస్తున్న విశ్వనాథ్ మహాజన్

రుద్రూర్, మే 17: రుద్రూర్‌లోని నగరేశ్వర ఆలయంలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో శనివారం స్వామి రాందేవ్ మహరాజ్ సన్యాసీ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మహాజన్ మాట్లాడుతూ.. యోగా ద్వారా హైబీపీని ఎలా తగ్గించుకోవచ్చునో వివరించారు. యోగాను నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీ మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలి

*ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా.. ఆయా గ్రామాల్లో అధికారులు, నాయకులు కలిసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కొన్ని గ్రామాల్లో ఇండ్ల నిర్మాణానికి మార్కవుట్ చేశారు. ఇండ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం దశల వారీగా డబ్బులు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.*

హాసాకొత్తూర్‌లో భూమిపూజ చేస్తున్న ఏఎంసీ చైర్మన్

కొత్తపల్లిలో మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు

ముప్కాల్/మోర్తాడ్, మే 17: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను శనివారం వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందారవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిసాన్ ఖేత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సాగర్, గ్రామ కార్యదర్శి రాజు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

***హాసాకొత్తూర్‌లో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ..***

కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్లకు మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు సకాలంలో ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, పడిగెల ప్రవీణ్, రేవతి గంగాధర్, గోపిడి లింగారెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్, భాగ్యలక్ష్మి, లలిత, బుచ్చి మల్లయ్య, కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు.

***ఇండ్ల పత్రాల అందజేత..***

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శనివారం 96 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్లు మంజూరైన వారు నిర్మాణాలను త్వరగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాషా, గణేశ్, శేఖర్, నాగరాజు, రంజిత్, జగదీశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

***250 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు..***

మోస్రా (చందూర్), మే 17: మోస్రా మండలానికి 250 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి 150ఇండ్లు, మోస్రాకు 40, గోపూర్‌కు 30, చింతకుంటకు 20, చేనంబర్ తండాకు పది ఇండ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభిస్తే, దశల వారీగా ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తుందని తెలిపారు.

ధర్పల్లిలో మార్కవుట్ ఇచ్చిన పంచాయతీ కార్యదర్శి

***ఇందల్వాయిలో..***

ఇందల్వాయి, మే 17: ఇందల్వాయిలో 37మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా.. అందుకు సంబంధించిన మంజూరు పత్రాలను ఎంపీడీవో అనంత్‌రావు స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌గౌడ్, ఆనంద్, భరత్, రవి, ప్రసాద్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

***నిజామాబాద్ మండలంలో..***

సారంగాపూర్, మే 17: నిజామాబాద్ మండలంలోని చక్రధర్‌నగర్ తండాలో తొమ్మిది మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా.. మంజూరు పత్రాలను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. డీసీసీ డెలిగేట్ జావాజీ రమేశ్, నాయకులు కుమార్‌రెడ్డి, కొండా శ్రీనివాస్, బొల్లం ప్రవీణ్, వీర్‌కుమార్, హరినాయక్ పాల్గొన్నారు.

***ధర్పల్లిలో మార్కవుట్..***

ధర్పల్లి, మే 17: ధర్పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శనివారం మార్కవుట్ ఇచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. నిబంధనల మేరకు ఇల్లు నిర్మించుకోవాలని, విడుతల వారీగా డబ్బులు మంజూరవుతాయని ఆయన లబ్ధిదారులకు సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## హైపర్ టెన్షన్‌పై నిర్లక్ష్యం వద్దు

ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యులు

ఖలీల్‌వాడి, మే 17: హైపర్ టెన్షన్‌పై నిర్లక్ష్యం వహిస్తే అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 2కే రన్ నిర్వహించారు. ర్యాలీని చిన్న పిల్లల వైద్య నిపుణుడు సురేశ్‌జాజు జెండా ఊపి ప్రారంభించారు. ఎల్లమ్మగుట్ట చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా, కోర్టు మీదుగా పులాంగ్ చౌరస్తా వరకు కొనసాగింది. ర్యాలీలో ప్రముఖ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సందీప్‌రావు, ఓపెన్ హార్ట్ సర్జన్ డాక్టర్ అవిన్ సనార, న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీకృష్ణ, ఆదిత్య, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అజయ్‌కుమార్, విశ్వనాథ్ పాటిల్, జనరల్ సర్జన్ మనోజ్, యజ్ఞ, స్వామి, వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మోస్రా (చందూర్), మే 17: మోస్రా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉపాధ్యాయులు శనివారం అవగాహన కల్పించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిబిరంలో విద్యార్థులకు ఐదు రోజులపాటు యోగా, డ్రాయింగ్, పాటలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నాగనాథ్, ఉపాధ్యాయులు బాలాజీరావు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ

మోర్తాడ్/ ధర్పల్లి, మే 17: సబ్సిడీపై జీలుగ విత్తనాలను రైతులకు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని మోర్తాడ్ సొసైటీ చైర్మన్ కల్లెం అశోక్ అన్నారు. శనివారం మోర్తాడ్, శెట్‌పల్లి పీఏసీఎస్‌లలో జీలుగ విత్తనాలను రైతులకు అందజేసి మాట్లాడారు. ఏవో హరీశ్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, వైస్ చైర్మన్ దడివె నవీన్, డైరెక్టర్ ముత్యా లక్ష్మణ్, కార్యదర్శి కాశీరాం పాల్గొన్నారు. ధర్పల్లి సొసైటీ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల పంపిణీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి ప్రారంభించారు. 30 కేజీల జీలుగ విత్తన బ్యాగ్‌ను 50 శాతం సబ్సిడీపై రైతులకు రూ.2137.50 అందించనున్నట్లు ఏవో వెంకటేశ్ తెలిపారు. సొసైటీ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, నాయకులు చెలిమెల శ్రీనివాస్, సబావత్ శ్రీనివాస్ నాయక్, పోత రాజు, లింబ్యా తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన అవసరం

అంబం గ్రామంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రుద్రూర్, మే 17: ప్రజలు చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సాయన్న అన్నారు. మండలంలోని అంబం గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలు, పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వాహనం నడిపే ప్రతి వ్యక్తీ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగులు, లోన్లు, ఆన్‌లైన్ గేమ్‌లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. ఆదివారం ఉదయం హెల్మెట్, ట్రాఫిక్ నిబంధనలపై పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. రుద్రూర్ – బోధన్ ప్రధాన రహదారిపై కానిస్టేబుల్ సురేశ్ వాహనదారులకు లైసెన్సు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు.

***చోరీలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి..***

సిరికొండ, మే 17: వేసవికాలం కావడంతో ప్రజలు ఇండ్లకు తాళం వేయకుండా ఆరుబయట నిద్రించడంతో చోరీలు జరిగే ప్రమాదం ఉన్నదని ఎస్సై రాము తెలిపారు. దొంగతనాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో సైబర్ నేరాలు, ఇతర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటితో నేరాలు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## అడ్మిషన్లు తెస్తేనే జీతాలు.. యాజమాన్యాల హుకుం

మాట్లాడుతున్న యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద సూరి

ఆర్మూర్‌టౌన్, మే 17: పట్టణ, మండల వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు తెస్తేనే టీచర్లకు జీతాలు ఇస్తామని హుకూం జారీ చేస్తున్నాయని యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద సూరి అన్నారు. పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు తమకు అడ్మిషన్లు తెస్తేనే జీతాలు ఇస్తామని యజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. పట్టణంలోని ఆయా కాలనీలు, గ్రామాల్లో అడ్మిషన్ల కోసం తిరుగుతున్నారని, ఒక్కో టీచర్ కనీసం 10 అడ్మిషన్లు చేయించాలని సంబంధిత యాజమాన్యాలు టార్గెట్ విధించాయని, లేకపోతే ఒక్క నెల జీతం ఇవ్వరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, సెలవులు ఉన్నప్పటికీ అడ్మిషన్ల కోసం తిరుగుతున్నామని వాపోతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకొని యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## 'జగ్గారెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

ప్రెస్ భవన్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ముదిరాజ్ ఉపాధ్యక్షుడు యాసడ నర్సింగ్

ఆర్మూర్‌టౌన్, మే17: బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాసడ నర్సింగ్ శనివారం ఫైర్ అయ్యారు. పట్టణంలోని ప్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ ముద్దు బిడ్డ ఈటెల రాజేందర్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఖబడ్దార్ అని జగ్గారెడ్డిని తీవ్రంగా హెచ్చరించారు. చేసిన అనుచిత వ్యాఖ్యలు వెంటనే వెనక్కు తీసుకోవాలని లేని పక్షంలో ఘాటైన సమాధానం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాలు, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MANDA ARANNA S/o. MANDA NADIPI LIMBANNA, R/o. H.No.3-122/4, Village: Doosgaon, Mdl: Dichpally, Dist: Nizamabad. T.S., Change my name as MANDA LIMBADRI (New name)
NTZ-338446

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

FINANCIAL SERVICES

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

# 'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

రెండో ర్యాంకును సాధించిన అస్మితను సన్మానిస్తున్న తిమ్మాపూర్ గ్రామస్తులు

ముప్కాల్ మండలకేంద్రంలో ప్రతిభ పురస్కారం అందుకుంటున్న అణన్య యాదవ్

మోర్తాడ్, మే 17 : తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన కుమారి అస్మిత పదో తరగతిలో 559 మార్కులు సాధించి మండలంలో రెండో టాపర్‌గా నిలిచినందుకు గాను, 500 మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన మరో పది మంది విద్యార్థులను తిమ్మాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో సమ్మిరెడ్డి, పురుషోత్తం, గ్రామకమిటీ సభ్యులు నర్సయ్య, లక్షపతి, రాజు, లింబన్న, నర్సయ్య, రాజన్న, దేవీదాస్, అక్షయ్, అశోక్, మాజీ ఉపసర్పంచ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రతిభా పురస్కారాల అందజేత..**

ముప్కాల్, మే 17 : 2024-25 పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శనివారం ఉదయం మండల కేంద్రంలోని జీఎన్ఆర్ గార్డెన్‌లో ప్రతిభ పురస్కారాలను మండల అధికారుల చేతుల మీదుగా అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ, పోలీసులు, లయన్స్ క్లబ్ సభ్యులు సంయుక్తంగా కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు, ఈ మధ్యకాలంలో జరిగిన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థులను సైతం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్ ఆనంద్, ముప్కాల్, బాల్కొండ ఎస్సైలు రజనీకాంత్, నరేశ్, ఎంపీవో గౌస్ మోహినుద్దీన్, ఎంఈవో రవికుమార్, గ్రామకమిటీ అధ్యక్షుడు సిద్ద రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నెమలి అప్పగింత

నెమలిని అధికారులకు అప్పగిస్తున్న స్థానికులు

ఆర్మూర్‌టౌన్,మే 17: పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద కోతులు ఓ నెమలిని వెంబడించాయి. స్థానికులు గమనించి వెంటనే కోతులను తరిమేసి నెమలిని సురక్షితంగా పోలీసులకు అప్పగించారు. వారు శనివారం ఆర్మూర్ పోలీస్ స్టేషనకు తీసుకెళ్లారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందజేయడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నెమలిని తీసుకెళ్లారు.

## నేడు బోధన్ సీఎస్ఐ చర్చిలో పలు ప్రారంభోత్సవాలు

శక్కర్‌నగర్, మే 17: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు చర్చి ఫాస్టర్ ఎం. ప్రభాకర్, ప్రతినిధులు డి.జ్యోతి రాజ్, ఎడ్వర్డ్ ముల్లర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడరేటర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ డాక్టర్ కె. రూబెన్ మార్క్ ఈ ప్రారంభోత్సవాలను చేయనున్నట్లు పేర్కొన్నారు.

## దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా

నవీపేట, మే 17: ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తూ తిరిగి జూలై 9న నిర్వహించాలని కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడ్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్తాన్‌తో యుద్ధం కొనసాగుతున్న తరుణంలో కార్మిక సంఘాల నిర్ణయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

ముప్కాల్ మే 17 : మండలంలోని నల్లూర్ గ్రామానికి మంజూరైన రూ.10 లక్షల విలువైన సీసీ రోడ్డు పనులను శనివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ

మోర్తాడ్, మే 17 : కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో గౌడసంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శనివారం బీజేపీ నాయకులు రెంజర్ల గంగాధర్, గౌడసంఘం సభ్యులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సంఘానికి ఎంపీ నిధులు రూ.4లక్షలు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో చింత ప్రవీణ్, తోకల నర్సయ్య, వడ్ల మోహన్, గణేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 22 న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

భీమ్‌గల్, మే 17: మండలంలోని లింగాపూర్ చౌత్‌లో ఈ నెల 22న అంబేద్కర్ విగ్రహావిష్కరన నిర్వహించనున్నట్లు దళిత ఐక్య సంఘటన మండల అధ్యక్షుడు గడాల ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన దళిత ఐక్య సంఘటన నాయకులతో కలిసి భీమ్‌గల్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్వాధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ రిక్క లింబాద్రి, ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రధానాచార్యులు ప్రొఫెసర్ చింతకింది కాశీం, ప్రొఫెసర్ పున్నయ్య పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న కళా బృందంతో దూందాం కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## బీపీపై వైద్య సిబ్బంది, రోగులకు అవగాహన

ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్

ఆర్మూర్‌టౌన్, మే17: పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, రోగులకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ శనివారం అవగాహన కల్పించారు. హైపవర్ టెన్షన్ ద్వారా వచ్చే అనర్థాలను వివరించారు. ఆహారంలో ఎక్కువ పొటాషియం, తక్కువ సోడియం తీసుకోవాలని, ధూమపానం, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఫాతియా ఫెర్డోస్, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఫార్మాసిస్ట్ సురేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించాలి

మెండోర మండల కేంద్రంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

మెండోరా, మే 17 : మండల కేంద్రంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం REAC మెంబర్ కోటపాటి నరసింహం నాయుడు మాట్లాడుతూ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి, సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడి పొందాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

## వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో అనంద్‌రావు

ఏర్గట్ల, మే 17: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాన్ని ఎంఈవో అనంద్‌రావు ఏర్గట్ల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో మ్యూజిక్, డ్యాన్స్, యోగా, గణితం, ఆంగ్లంలో మెళకువలు మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. స్నాక్స్ కూడా అందిస్తామని, విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బాల సాహితీవేత్తకు సాహిత్య సత్కారం

బాల సాహిత్య గ్రహ